అభివృద్ధికి పట్టం కట్టండి


ఐనాడలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, స్థానిక నాయకులు

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- ఐనాడలో హుషారుగా ఎన్నికల ప్రచారం

పద్మనాభం: గత ఐదేళ్లలో చేసిన అభివృద్ధి చూసి తమకు పట్టం కట్టాలని వైఎస్సార్ సీపీ భీమునిపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. పద్మనాభం మండలంలో ఐనాడ గ్రామం నుంచి ఆయన ఆదివారం ఎన్నికల శంఖారావం పూరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పద్మనాభం మండలంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు రూ.320 కోట్లు వెచ్చించామన్నారు. ఈ సారి ఎన్నికల్లో తనను, విశాఖపట్నం ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిని ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. టీడీపీ హయాంలో నిర్లక్ష్యానికి గురైన పద్మనాభంలోని అనంత పద్మనాభ స్వామి ఘాట్ రోడ్డును రూ.5 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. 14 గ్రామాల ప్రజల చిరకాల స్వప్నమైన పాండ్రంగి సమీపాన గోస్తనీ నదిపై రూ.16.50 కోట్లతో వంతెన నిర్మాణ పనులు చురుగ్గా చేస్తున్నామన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణమాఫీ, జీరో వడ్డీ ఇస్తానని హామీ ఇచ్చి దగా చేశారన్నారు. నాలుగేళ్లు స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆసరా కింద రుణ మాఫీ చేయడంతోపాటు చేయూత కింద ఒక్కొక్కరికి రూ.18,750 ఇవ్వడంతో ఆర్థిక స్వావలంబన సాధించారన్నారు. దేశంలో వృద్ధులకు రూ.3వేలు పింఛన్ ఇచ్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్ మోహన రెడ్డి అన్నారు. పేద ప్రజల పట్ల నిబద్ధత కలిగిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని కొనియాడారు. రాష్ట్రంలో కోటి 20 లక్షల మందికి రూ.3 లక్షల 70 వేల కోట్లు సంక్షేమ పథకాల రూపంలో అందజేశారన్నారు. వివక్షకు తావు లేకుండా అన్ని పార్టీల వారికి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అందించారన్నారు. చిన్నాపురంలో ఏళ్ల తరబడి భూములను సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు లేకపోవడంతో ఎటువంటి లబ్ధి పొందలేకపోయేవారన్నారు. ఆ భూములకు తాము పట్టాలివ్వడంతో వాటి విలువ రూ.కోట్లలో పలుకుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంతో వారందరూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారన్నారు. రేవిడి - ఐనాడ రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేసినప్పటికీ కాంట్రాక్టర్ టీడీపీకి చెందిన వారు కావడంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి పేరు వస్తుందని పనులు చేపట్టలేదన్నారు. ముందుగా ముత్తంశెట్టి శ్రీనివాసరావును ఐనాడ జంక్షన్ నుంచి మేళతాళాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నడుమ ర్యాలీగా గ్రామంలోకి తీసుకొచ్చారు. ప్రచార రథం పైనుంచి ఓటర్లకు అభివాదం చేస్తూ ముత్తంశెట్టి ముందుకు సాగారు. మహిళలు హారతులు పట్టారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, భీమునిపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచలి సూర్యనారాయణ, మాజీ వైస్ చైర్మన్ కోరాడ పాపారావు, ఐనాడ సర్పంచ్ మామిడి ఆరంజ్యోతి, ఎంపీటీసీ సభ్యురాలు కోరాడ రమణమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు మామిడి శివరామకృష్ణ, కోరాడ పాపారావు, చందక శ్రీను, చందక పైడినాయుడు, కోండ్రోతు శ్రీనివాసరావు, బుగత సత్యనారాయణ, మరగడ అప్పారావు, సీర సూరప్పడు, అముజూరి అప్పారావు, కోన రమణ, మొకర అప్పలనాయుడు, బొలె అప్పలనాయుడు, బోని సన్యాసినాయుడు, సుంకర నారాయణరావు పాల్గొన్నారు.


ఐనాడలో ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు హారతిస్తున్న మహిళలు

క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

హోమియో మందుల పంపిణీ


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

భీమునిపట్నం: స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి పర్యవేక్షణలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. 95 మంది రోగులను వైద్యులు టి.జగన్నాథరావు, టి.జె.మోహన్ పరీక్షించి అవసరమైన వారికి మందులు అందించారు. ఫౌండేషన్ ప్రతినిధులు కె.ఎస్.ఎన్.మూర్తి, కె.చంద్రశేఖరరావు, కె.భానోజీరావు, సభ్యులు వి.లక్ష్మణరావు, శ్రీనివాసరావు, రాంబాబు, శంకర్, రాము పాల్గొన్నారు.

భీమిలిలో గెలుపు వైఎస్సార్‌సీపీదే..


చంద్రనగర్‌లో నినాదాలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు భీమిలి నియోజకవర్గం చంద్రనగర్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. భీమిలి నుంచి మళ్లీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు పోటీ చేస్తుండడంతో కార్యకర్తలు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. భీమిలిలో మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమని నినదించారు. ముత్తంశెట్టి జిందాబాద్ అంటూ హోరెత్తించారు. కార్యక్రమంలో 89వ వార్డు క్లస్టర్ అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ, కార్యకర్తలు హరి, రవి, బాబ్జి, రాము, సంతోష్, చిన్నారావు, సాయిరామ్, యర్రమ్మ, విజయ్ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారం నేడు

ఆనందపురం : మండలంలోని మామిడిలోవలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఎన్నికల ప్రచారం సోమవారం నిర్వహించనున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పరదేశమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు


పరదేశమ్మ తల్లి

పద్మనాభం : మండలంలోని కృష్ణాపురంలో సురాల వారి కుటుంబ సభ్యుల ఇలవేల్పు పరదేశమ్మ ఉత్సవాలు సోమవారం నుంచి తొలేళ్లతో ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ప్రతిమలను గ్రామంలో ఊరేగిస్తారు. మంగళవారం రథాల ఉత్సవం, బుధవారం ముగింపు ఉత్సవం నిర్వహిస్తారు. ఉత్సవాలకు సంబంధించి సురాల వారి కుటంబ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయానికి, రోడ్డుకి ఇరువైపులా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలు సాంస్కతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం


ఆనందపురం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రం


రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

తగరపువలస: సోమవారం నుంచి ఈ నెల 30 వరకు జరగనున్న పదో తరగతి పరీక్షలకు సంబంధించి నియోజకవర్గంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. భీమిలి మండల పరిధిలో 13 కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఎంఈవో శివరాణి తెలిపారు. వీటిలో 10 ప్రభుత్వ హైస్కూళ్లుకాగా 3 ప్రైవేట్ పాఠశాలలు కేటాయించినట్టు తెలిపారు. వీరికి ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పరీక్షలు నిర్వహించనున్నారు. అలాగే ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షలు కూడా సోమవారం నుంచి ఈ నెల చివరి వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు జరగనున్నాయి. ఓపెన్ టెన్త్ విద్యార్థులకు భీమిలి గవర్నమెంట్ హైస్కూల్, ఇంటర్మీడియట్ విద్యార్థులకు సెయింటాన్స్ హైస్కూల్‌లో పరీక్షా కేంద్రాలను కేటాయించినట్టు ఎంఈవో తెలిపారు.

ఆనందపురం : పదో తరగతి పరీక్షల కోసం మండలంలో ఐదు కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారని ఎంఈవో ఎస్ఎస్ పద్మావతి తెలిపారు. మండలంలో 11 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 13 ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వాటిలో విద్యనభ్యసిస్తున్న 1,082 మంది పదో తరగతి విద్యార్థులు సోమవారం నుంచి పరీక్షలకు హాజరవుతున్నారు. ఆనందపురం ఉన్నత పాఠశాలలో ఏ, బీ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఇక్కడ ఏ సెంటర్‌లో 240 మంది, బి సెంటర్‌లో 220 మంది పరీక్ష రాయనున్నారు. బోయిపాలెం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సెంటర్‌లో 200 మంది, శొంఠ్యాం సెంటర్‌లో 212 మంది, పెద్దిపాలెంలోని నారాయణ ఉన్నత పాఠశాలలో 196 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఈ విషయమై సీఐ టీవీ తిరుపతిరావు మాట్లాడుతూ ఐదు పరీక్షా కేంద్రాలు వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నామని, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు.

పద్మనాభం: పదో తరగతి పరీక్షల కోసం మండలంలో నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో 702 మంది పరీక్షలు రాయనున్నారు. రేవిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంలో 163 మంది, రెడ్డిపల్లి జెడ్పీ హైస్కూల్‌లో 181 మంది, పద్మనాభం హైస్కూల్‌లో 180 మంది, మద్ది హైస్కూల్‌లో 178 మంది పరీక్షలు రాయనున్నారు. మద్ది కేంద్రంలో తొమ్మిది గదులు, మిగతా మూడు కేంద్రాల్లో ఎనిమిదేసి చొప్పున గదులు సిద్ధం చేశారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ఆనందపురం : విశాఖ నార్త్‌జోన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లకు ఆనందపురం పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కౌన్సెలింగ్ చేశారు. ఎలక్షన్ నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని 34 మంది, ఆనందపురంలోని 14 మందికి, పద్మనాభం లోని ఏడుగురు, భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలోని 21 మందికి నార్త్ జోన్ ఏసీపీ బి.సునీల్ కౌన్సెలింగ్ చేశారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించినా, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, ఎన్నికల విధులకు ఆటంకం కలిగించినా చర్యలు తీసుకుంటామని రౌడీషీటర్లను హెచ్చరించారు. ఈ మేరకు అందరి వద్ద పూచీకత్తులు తీసుకున్నారు. కార్యక్రమంలో ఆనందపురం సీఐ టీవీ తిరుపతిరావు, ఎస్ఐలు సంతోష్, శివ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికవాడలో పోలీసుల కవాతు


చిట్టివలసలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

తగరపువలస: రానున్న ఎన్నికలు సజావుగా సాగేందుకు ప్రజలకు భరోసా కల్పించేలా భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు ఆదివారం కవాతు నిర్వహించారు. భీమిలి సీఐ డి.రమేష్ ఆధ్వర్యంలో రాజస్థాన్, ముంబయికి చెందిన కేంద్ర పోలీసు బలగాలు కవాతులో పాల్గొన్నాయి. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎలక్షన్ కమిషన్ నిబంధనలు అమలు చేయడానికి పోలీసులు సిద్ధంగా ఉన్నారని తెలియచేయడానికే ప్రదర్శన నిర్వహించామని ఎస్ఐలు గంటా హరీష్, పైడిరాజు పేర్కొన్నారు.

నేటి నుంచి స్పెషల్ యోగా థెరపీ తరగతులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం నుంచి ప్రత్యేక యోగా థెరపీ తరగతులు నిర్వహించనున్నట్టు కేంద్రం సంచాలకుడు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు.భానుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు ఈ తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు 94944 01919, 93980 19922 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు


స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు



నిత్య కల్యాణం తిలకిస్తున్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేసి, 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు శ్రావణ్, తదితరులు ఈ పూజ చేశారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్య కల్యాణం

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మండపంలో వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

పిచ్చుకుల సంరక్షణ అందరి బాధ్యత


ధాన్యం కంకులతో క్యూరేటర్ నందనీ సలారియా, హరిత వికాస్ ఫౌండేషన్ సభ్యులు

ఆరిలోవ: ప్రకృతిలో పిచ్చుకలను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా వుందని జూ క్యూరేటర్ నందనీ సలారియా తెలిపారు. పిచ్చుకల దినోత్సవం సందర్భంగా ఇందిరా గాంధీ జూ పార్కులో ఆదివారం హరిత వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జూ సందర్శకులకు పిచ్చుకలపై అవగాహన కల్పించారు. అనంతరం జూలో పలు చోట్ల చెట్లకు పిచ్చుకల ఆహారం కోసం ధాన్యం కంకులు కట్టారు. ఈ సందర్భంగా క్యూరేటర్ మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో పరిస్థితుల వల్ల పిచ్చుకల జాతి అంతరించిపోతుందన్నారు. అక్కడక్కడా కనిపించే వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా వుందన్నారు. ప్రకృతిలో అన్ని జాతుల జీవులను రక్షించుకుని జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీఎఫ్ మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్ పాలవలస గోపాలనాయుడు, ఎఫ్ఎస్‌వోలు, సిబ్బంది, హరిత వికాస్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు


విశేషంగా ఆకట్టుకున్న కళాకారుల నృత్యం

మధురవాడ : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా విశాఖపట్నం జ్యోష్ డ్యాన్స్ అకాడమీ కళాకారులు శిల్పారామంలో ఆదివారం చక్కగా నృత్యం చేశారు. పలు గీతాలకు చిన్మయి, గామిని, నక్షత్ర, లిఖిత, శ్యామల, యశస్విని, గున్విక, అనూష, నవ్య, సౌజన్య, స్రవంతి, కీర్తి, అక్షర, కోమల్, చందు తదితరులు చేసిన నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని ఏవో విశ్వనాథరెడ్డి పర్యవేక్షించారు.

నాగవంశీయులంతా వైఎస్సార్‌సీపీతోనే ..


బొత్స ఝాన్సీలక్ష్మి, మంత్రి సత్యనారాయణతో నాగవంశం కార్పొరేషన్ చైర్‌పర్సన్ అప్పలకొండమ్మ దంపతులు

తగరపువలస : రాష్ట్రంలో నాగవంశీయులను గుర్తించి ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీతోనే నాగవంశీయులంతా ఉంటారని ఆ సామాజిక సంఘం రాష్ట్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ బొడ్డు అప్పలకొండమ్మ అన్నారు. ఆదివారం ఆమె నగరంలో విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మితోపాటు మంత్రి బొత్స సత్యనారాయణను కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కృషితో పద్మనాభంలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి 50 సెంట్ల స్థలం కేటాయించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగీకరించినట్టు గుర్తు చేశారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా నాగవంశీయులను ఆదరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ గెలుపునకు తామంతా కృషి చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డు అప్పలనాయుడు పాల్గొన్నారు.

చురుగ్గా రోడ్డు నిర్మాణ పనులు


ముచ్చర్ల వద్ద జరుగుతున్న పనులు

ఆనందపురం : మండలంలోని నీళ్లకుండీలు జంక్షన్ నుంచి చిన్నాపురం వరకూ తారు రోడ్డు పునర్నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. సుమారు 15 కిలో మీటర్ల పొడవుండే ఈ తారురోడ్డు వర్షాలకు పలు చోట్ల ఛిద్రమైంది. దీంతో అక్కడక్కడ గోతులు ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ముఖ్యంగా ముచ్చర్ల, గిడిజాల, రేగానిగూడెం, ముకుందపురం, శిర్లపాలెం గ్రామాల వద్ద వర్షాలు కురిస్తే కొండల నుంచి వచ్చే వరదనీరు నేరుగా తారు రోడ్డుపై నుంచే ప్రవహించడంతో దెబ్బతింది. కాగా ఈ సమస్యను భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో గతంలోనే హై ఇంపాక్ట్ రోడ్డు గ్రాంటు కింద రూ.6 కోట్లు మంజూరయ్యాయి. దీంతో పనులు వేగంగా జరుగుతున్నాయి. రోడ్డు దెబ్బతిన్న చోట పూర్తి స్థాయి మరమ్మతులు చేయడం, బెర్మలను వెడల్పు చేయడంతోపాటు మొత్తం రోడ్డంతా కొత్తగా తారు లేయరు వేస్తున్నారు. పనులు తొందరలోనే పూర్తి కానున్నాయని అధికారులు తెలిపారు.

శాస్త్రోక్తంగా అనంతుని పెళ్లి రాటోత్సవం


పెళ్లి రాట వేస్తున్న అర్చకులు, భక్తులు

పద్మనాభం : పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో ఈ నెల 20 నుంచి 26 వరకు నిర్వహించనున్న అనంతుని కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం అనంతుని పెళ్లి రాటోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా అర్చక స్వాములు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం కుంతీ మాధవ స్వామి ఆలయ గాలి గోపురం వద్ద పెళ్లి రాట వేశారు. కార్యక్రమంలో ఈవో నానాజీ బాబు, పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప, వైఎస్సార్ సీపీ నాయకులు తాలాడ పద్మనాభం, ఈర్ల ఈశ్వరరావు, గంగిరెడ్ల పద్మనాభ స్వామి, తాలాడ పైడిరాజు, సుంకర నారాయణరావు, భక్తబృందం సభ్యుడు మొకర సన్నిబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల సంబరాలు


అంబేడ్కర్ కూడలిలో సంబరాలు చేసుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస : వైఎస్సార్‌సీపీ భీమిలి అభ్యర్థిగా ముత్తంశెట్టి శ్రీనివాసరావును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడంతో జీవీఎంసీ ఒకటో వార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ కూడలిలో ఆదివారం సంబరాలు జరిపారు. భారీగా బాణసంచా వెలిగించి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మరోమారు భీమిలిలో వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడిస్తామన్నారు. గత ఐదేళ్లలో సీఎం జగన్ సాయంతో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు నియోజకవర్గంలో రూ.5 వేల కోట్ల అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు అక్కరమాని చినబాబు, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ రమణ, గూడెల నాని, బంక శ్రీను, జగుపల్లి సతీష్, నాగోతు కృష్ణ, తమ్మిన నరసింగరావు, పందిరి విజయ్, తమ్మిన కూర్మారావు, వెంపాడ వెంకటరమణ, నీలాపు రామిరెడ్డి, దుంప సాయిరెడ్డి, సిమ్మల ప్రసన్న, రొక్కం శ్రీను, అక్కరమాని గంగాధర్, గిడుతూరి మురళి, పూర్ణ, కుమిలి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా హుషారుగా ప్రచారం


గొల్లల ఎండాడలో ప్రచారంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు

కొమ్మాది : జీవీఎంసీ 8వ వార్డు గొల్లల ఎండాడలో కార్పొరేటర్ లొడగల అప్పారావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆదివారం జోరుగా హుషారుగా ప్రచారం చేశారు. ముందుగా ఆ ప్రాంతంలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ముత్తంశెట్టి శ్రీనివాసరావు అత్యధిక మెజారిటీతో గెలవాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు వివరించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావును, వైజాగ్ ఎంపీగా బొత్స ఝాన్సీ లక్ష్మిని గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు లొడగల రామ్మోహన్, నొడగల రాంబాబు, అప్పలస్వామి, మహిళా నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణ ఆలయం ప్రారంభం


ప్రతిష్ఠించిన శ్రీకృష్ణ భగవానుని విగ్రహం

సబ్బవరం : మండలంలోని రాయపుర అగ్రహారంలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ ఆలయం ఆదివారం వైభవంగా ప్రారంభించారు. వేదపండితుల మంత్రోచ్చారణతో యంత్ర స్థాపన, శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి మండపారాధన, హోమాలతోపాటు పూర్ణాహుతి శాస్త్రోక్తంగా నిర్వహించారు. సర్పంచ్ పిల్లల అప్పలనాయుడుతోపాటు ఆలయ ధర్మకర్త నక్కెళ్ల అచ్చిబాబు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ముందుగా కోలాటం పోటీల్లో భాగంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బృందాల ప్రదర్శన ఆకట్టుకుంది. పోటీల్లో పాల్గొన్న వారిని నిర్వాహకులు సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. సాయంత్రం నిర్వహించిన ఊరేగింపులో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్వామి వారిని వైఎస్సార్ సీపీ పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్, శిరీష దంపతులు, వీకేపీసీపీఐఆర్ చైర్మన్ చొక్కాకుల వెంకటరావు, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు దర్శించుకున్నారు.